క్లుప్తంగా

నేటి నుంచి ఎన్నికల ప్రచారం

రామాపురం: మండలంలోని రాచపల్లె గ్రామం నాయునివారిపల్లెలో గురువారం ఉదయం 10 గంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి రాయచోటి నియోజకవర్గ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణలు బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో తెలిపారు.

ఘనంగా టైలర్స్ డే



కేక్ కట్ చేస్తున్న టైలర్స్

చిట్వేలి : ప్రపంచ టైలర్స్ డేను పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలో చిట్వేలి టైలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. స్థానిక శివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టైలర్లు పాల్గొన్నారు. అనంతరం మహిళా టైలర్స్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైలరింగ్‌కు గిరాకీలు లేక అవస్థలు పడుతున్నారన్నారు. చేతి వృత్తులను కాపాడేందుకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందజేయాలని కోరారు.

సీహెచ్‌సీలో అందుబాటులో 'టెనాక్టివ్ ప్లస్'

సిద్దవటం : గుండెపోటు వచ్చిన వారికి సిద్దవటంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో టెనాక్టివ్ ప్లస్ ఇంజక్షన్ అందుబాటులో ఉందని వైద్యాధికారి డాక్టర్ సాయి వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఎమర్జెన్సీ కార్డియో కేర్ కార్యక్రమంలో భాగంగా అధిక ధర కలిగినటువంటి టెనాక్టివ్ ప్లస్ ఇంజక్షన్ గుండెపోటు వచ్చిన వారికి అర్ధగంట లోపు ఈ ఇంజక్షన్ వేస్తే ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇంజక్షన్ ఖరీదు రూ.50 వేలు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగ పరచుకోవాలని ఆయన కోరారు.

పోస్టర్ల ఆవిష్కరణ

పెనగలూరు(ఓబులవారిపల్లె): పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని డాక్టర్ తౌసిఫ్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3వ తేదీన జరగనున్న పల్స్ పోలియోను ప్రతి ఒక్కరూ విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. మండలంలో 4325 మంది 0 – 5 సంవత్సరాల మధ్య పిల్లలు ఉన్నారని వీరి కోసం నాలుగు రూట్లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీకృష్ణ, ఏఓ పద్మభూషన్ రెడ్డి, సీహెచ్ఎస్ లక్ష్మీనరసమ్మ, సూపర్‌వైజర్ చిన్నమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సంత, బస్టాండు గేటు వేలం

రామాపురం : మండల కేంద్రంలోని పశువుల సంత, బస్టాండు గేటులకు సంబంధించి 2024 – 25 వసూలు చేసుకునే హక్కు విషయమై శుక్రవారం వేలం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3గంటలకు పశువుల సంత జరుగు ప్రదేశంలో పంచాయతీ విస్తీర్ణ అధికారి ఆధ్వర్యంలో వేలం జరుగనున్నట్లు నల్లగుట్టపల్లె పంచాయతీ సెక్రటరీ విమలకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటదారుడు ముందస్తుగా బస్టాండు గేటుకు రూ.30వేలు, పశువుల సంతకు రూ.50వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవల్సి ఉంటుందన్నారు.

నియామకంపై హర్షం

రాయచోటి : ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ తెగల కో–ఆపరేటీవ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ట్రైకార్)సంస్థ చైర్మన్‌గా గుండా సురేంద్ర నియమితులు కావడం పట్ల అన్నమయ్య జిల్లా పరిధిలో పలువురు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం చైర్మన్‌గా గుండా సురేంద్ర బాధ్యతలు చేపట్టడంపై అన్నమయ్య జిల్లాలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, గిరిజన సంఘాల నేతలు వేర్వేరుగా హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు. రాయచోటి నియోజకవర్గం మోటకట్ల గ్రామానికి చెందిన గుండా సురేంద్ర విద్యార్థి నాయకుడిగా, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేతగా, గిరిజనుల సంక్షేమం కోసం చేసిన కృషికి గుర్తింపుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ బాధ్యతలు అప్పగించారని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి

రామాపురం : మార్చి 3న జరగబోయే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి వినోద్‌కుమార్, ఎంఈఓ రామకృష్ణుడులు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పల్స్ పోలియో నిర్వహణపై టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ మండలంలోని 13 పంచాయతీలలో 0 – 5 వయస్సు గల పిల్లలు 4,072 మందికి మూడు చుక్కలు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. మండలంలో 47పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలియో రహిత మండలంగా చేసేందుకు సహకరించాలన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ ఉషారాణి, సీహెచ్ఓ ఎలియాజర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మజ, రాణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే ధ్యేయం

- భూమిలేని నిరుపేదలకు భూ హక్కును కల్పించింది జగన్ ప్రభుత్వమే
- సంబేపల్లెలో జెడ్‌హెచ్‌డీసీ భూముల రెగ్యులర్, ఫ్రీ ల్యాండ్ పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి



వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

సంబేపల్లె : పేదల జీవితాలలో వెలుగులు నింపాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం సంబేపల్లెలో జరిగిన జెడ్‌హెచ్‌డీసీ భూముల రెగ్యులర్, ఫ్రీ ల్యాండ్ పట్టాల పంపిణీలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మి, చిదంబర్ రెడ్డి, రమేష్ రెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బరుగు రెడ్డన్నలతో కలిసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రకాశ్ నగర్‌కు చెందిన దళితులకు భూ హక్కులు పొందేలా చర్యలు తీసుకున్నామన్నారు. మోటకట్ల రెవెన్యూ గ్రామంలో 105 మంది ప్రకాశ్ నగర్ దళితులకు 94 ఎకరాలు, నారాయణ రెడ్డిగారిపల్లె రెవెన్యూ గ్రామంలో 105 మంది ప్రకాశ్ నగర్ దళిత రైతులకు 106.7 ఎకరాల జెడ్‌హెచ్‌డీసీ భూములను వారివారి పేరు మీద బదాలయించి, పట్టాలు పంపిణీ చేశామన్నారు. దళితుల అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనని తెలియజేశారు. అలానే 2003కి ముందు డీకేటీ భూములకు రెగ్యులరైజ్ పట్టాలు 5610 మంది రైతులకు 3326.81 ఎకరాలు భూములు, రెండవ విడత అసైన్‌మెంట్‌లో 201 మంది రైతులకు 251.93 ఎకరాల భూములు, మొదటి విడత అసైన్‌మెంట్ కింద కొత్త డీకేటీ భూముల పట్టాలు లబ్ధిదారులు 277 మందికి 170.91 ఎకరాలు, ఇనాం భూ పట్టాలు 534 మందికి 492.92 ఎకరాలను పట్టాలుగా అందజేశామన్నారు. భూములు పొందిన రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ పేదలు పట్టాల భూములను అమ్ముకోవద్దని సూచించారు. పేదలు, బడుగు, బలహీన వర్గాలకు పట్టాలు పంపిణీలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాత్ర అభినందనీయమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్, సర్వేయర్, రెవెన్యూ సిబ్బందిని మండల ప్రజా ప్రతినిధులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి ఘనంగా సత్కరించారు. పట్టాల పంపిణీపై పేదలు, బడుగు, బలహీన వర్గాలలో హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ నిర్మల కుమార్, రెవెన్యూ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జగన్ పాలన స్వర్ణయుగం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన స్వర్ణయుగంగా మారిందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం జరిగిన సంబేపల్లె మండలంలోని వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు పురస్కార ప్రదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలనను సరళీకరించడంలో భాగంగా వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి సచివాలయాలకు అనుసంధానం చేశారన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు అందిస్తూ వలంటీర్లు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు వలంటీర్ల వ్యవస్థను మెచ్చుకున్నారన్నారు. నియోజకవర్గంలో రూ.2 వేల కోట్ల సంక్షేమం అందించామన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను ఎన్నడూ నెరవేర్చలేదని, రాబోయే ఎన్నికల్లో మరోసారి ప్రజలను మభ్యపెట్టేందుకు వస్తున్నారని ప్రజలు ఆయన మాటలు విశ్వసించవద్దని తెలియజేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా నిలుస్తున్న వలంటీర్లను సత్కరించడం తమ కర్తవ్యమని శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలో సేవలందిస్తున్న వలంటీర్లను పేరుపేరునా పిలిచి సేవా రత్న, సేవా వజ్ర, సేవా మిత్ర పురస్కారాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మలమైన మనస్సుతో ప్రశాంత జీవనం

రాయచోటి టౌన్ : మనల్ని మనం తెలుసుకోవడమే ధ్యానమని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం రాయచోటి శ్రీ షిరిడీ సాయి బాబా మందిరంలో గత రెండు రోజులుగా ది రాచవీడు పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ధ్యాన సప్తాహ మహాసభలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం యోగా, ధ్యాన సాధనతో మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. మారుతున్న పరిస్థితుల వలన యాంత్రిక జీవనంలో కోపాలు, ద్వేషాలు ఎక్కువ అవుతున్నాయని తెలిపారు. ఏకాగ్రత, నిర్మలమైన మనస్సుతో ప్రశాంత జీవన విధానాన్ని అలవర్చుకోవచ్చని సూచించారు. ధ్యానం సర్వరోగ నివారిణి అని తెలియజేశారు. ధ్యానం ద్వారా మనం ఏమిటో తెలుస్తుందని చెప్పారు. అనంతరం భీమవరానికి చెందిన పిప్పళ్ల ప్రసాద్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో పిరమిడ్ వ్యవస్థాపకులు కే.శే.పత్రీజీ అంతరంగిక కార్యదర్శి శివప్రసాద్, ధ్యాన సప్తాహ మహా సభల నిర్వాహకులు డాక్టర్ బయారెడ్డి, అధ్యక్షులు దేవకి సతీష్‌కుమార్, కార్యదర్శి జంగమయ్య, కోశాధికారి కొత్త సుదర్శన్, ఆహ్వాన కమిటీ అధ్యక్షులు కొప్పుల నాగిరెడ్డి, కార్యదర్శి శంకర్‌రెడ్డి, లయన్ కంటి ఆస్పత్రి చైర్మన్ వైవి స్వరూప్‌గుప్తా, రామచంద్ర మిషన్ సభ్యులు సరస్వతి అక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో ఇబ్బందులు లేకుండా చర్యలు



పారిశుద్ధ్యంపై సచివాలయం అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

రాయచోటి అర్బన్ : రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మున్సిపల్ ఇంజనీరింగ్, వాటర్ సప్లయ్ ఇంజనీరింగ్, వాటర్‌వర్క్స్ సిబ్బందితో నీటిసరాపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సరఫరాలో ఎలాంటి అలసత్వం వహించినా క్షమించే ప్రసక్తే లేదన్నారు. వెలిగల్లు జలాశయం నుంచి పట్టణానికి వచ్చే మంచినీరు నీటి శుద్ధికేంద్రంలో సరైన పద్ధతిలో క్లోరినేషన్ పద్ధతిలో జరిగేలా పర్యవేక్షించాలంటూ మున్సిపల్ డీఈ సుధాకర్‌నాయక్‌ను ఆయన ఆదేశించారు. నీరు వృథా కాకుండా ప్రజలు సరైన రీతిలో వినియోగించుకోవాలంటూ కోరారు. నీటిని వృథా చేసేవారి కుళాయి కనెక్షన్లను వెంటనే తొలగిస్తామంటూ హెచ్చరించారు. సమీక్షలో మున్సిపల్ ఏఈ క్రిష్టారెడ్డి, ఆర్‌ఐ మల్లికార్జున, ఫిట్టర్ రామక్రిష్ణతోపాటు నీటి రఫరా విభాగం అధికారులు, సిబ్బందిలు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై యుద్ధప్రాతిపదికన స్పందించండి

పారిశుద్ధ్యంతో పాటు తాగునీటి సరఫరాలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం ఆయన మున్సిపల్ అధికారులతో కలసి బోస్‌నగర్‌లో క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. ప్రజలు, దుకాణదారులు చెత్తను రోడ్లపైన, మురుగునీటి కాలువల్లో పారవేయకుండా మున్సిపల్ వాహనాలకు అందచేయాలంటూ కోరారు. మురుగునీటి కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా, మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేసిన నోటీసులు జారీచేసి కేసు నమోదు చేయాలని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను ఆదేశించారు.

నాణ్యమైన విద్యుత్ అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

చిన్నమండెం : విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఉమ్మడి కడప జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ పేర్కొన్నారు. బుధవారం చిన్నమండెం విద్యుత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ నెలసరి విద్యుత్ బిల్లుల వసూళ్ల లక్ష్య సాధనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వృథా కాకూడదన్నారు. ఎప్పటికప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లను, లైన్ల నిర్వహణ విధిగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీగా చర్యలు

- ఎన్నికల విధులపై పోలీసులకు శిక్షణా తరగతులు
- సూచనలు చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలారాణి, డీఎస్పీ చైతన్య



శిక్షణా తరగతులకు హాజరైన పోలీసులు

రాజంపేట : రాబోవు సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగుతోందని రాజంపేట డీఎస్పీ చైతన్య పేర్కొన్నారు. బుధవారం రాజంపేట సబ్ డివిజన్‌లోని పోలీసు సిబ్బందికి ఎన్నికల నిబంధనలు, బందోబస్తులపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం విధులు, నిబంధనలు తప్పనసరిగా పాటించాలన్నారు. పోలీసులు, ఎన్నికల సిబ్బంది ఐకమత్యంతో పని చేసినప్పుడే ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల్లో ముఖ్యపాత్ర పోలీసులదే ఉంటుందన్నారు. ఏదైనా చిన్నపొరపాటు జరిగితే అది పోలీసులు పైనే రుద్దుతారని ఇది ప్రతి ఒక్క పోలీసు గుర్తించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో రౌడీషీటర్లను గుర్తించాలన్నారు. వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. రైల్వేకోడూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి లీలారాణి మాట్లాడుతూ పోలింగ్ అధికారి సూచనల మేరకు కేంద్రాలలో పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార తీరును, ఎన్నికల జన సమీకరణ, గొడవలు అక్రమాలు తదితరాలను డేగకళ్లతో పరిశీలించేందుకు నిఘా కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. మొదటి రోజు శిక్షణ తరగతుల్లో పీఓ విధులు, చాలెంజ్ ఓటు, ఓటర్ స్లిప్‌లు, ఏజెంట్ల విధులు తదితర అంశాలపై ఉపాధ్యాయులు వేణుగోపాల్, నరసారెడ్డి పోలీసులు అవగాహన కల్పించారు.

కమనీయం.. భద్రాద్రి రాముడి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

రాయచోటి టౌన్ : పట్టణంలోని అభి కన్వెన్షన్ హాల్‌లో భద్రాద్రి రాముడి కల్యాణం కనుల పండువుగా సాగింది. భద్రాచలంలో నిర్వహించే సీతారాముల కల్యాణానికి రాష్ట్రంలోని నలుమూలల నుంచి ఎంతో భక్తులు తరలి వెళుతుంటారు. దీని కోసం ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని స్వామి వారి కల్యాణం తిలకించి వస్తుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకొని అభి కన్వెన్షన్ యజమాని ప్రముఖ వ్యాపారవేత్త రామకృష్ణారెడ్డి తన సొంత ఖర్చులతో స్వామి వారి కల్యాణం ఎంతో ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య భక్తిశ్రద్ధలతో జరిపారు. సుమారు మూడు గంటలకు పైగా నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అంతకుముందు మంగళవారం రాత్రి స్వామి వారి ఊరేగింపు పట్టణంలో అన్ని ప్రధాన వీధులలో ఊరేగించారు. బాణసంచాలు, కేరళ సంగీత వాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలతో భక్త జన కోలాహలం నడుమ శోభాయాత్ర సాగింది. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలతోపాటు భోజన ఏర్పాటు చేశారు. ఈ వేడుకలు, కల్యాణ మహోత్సవంలో భద్రాచలం ఆలయ ఈఓ రమాదేవి, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యా వైజ్ఞానిక సంబరాలు

సిద్దవటం: మండల కేంద్రం పరిధి ఎగువపేటలో ఉన్న శ్రీనలంద హైస్కూల్‌లో గురువారం నుంచి మార్చి 3వ తేదీ వరకు విద్యా వైజ్ఞానిక సంబరాలు జరుగుతాయని పాఠశాల ఏఓ లక్ష్మణస్వామి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మండల విద్యాశాఖ అధికారి శంకరయ్య, పాఠశాల కరస్పాండెంట్ బాలుగారి వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు విద్యా వైజ్ఞానిక సంబరాల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ విద్యా వైజ్ఞానిక సంబరాల్లో భాగంగా 26 అంశాలపై 217 నమూనాలతో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంబరాలను ప్రజలు, విద్యావేత్తలు, విద్యార్థులు సందర్శించి విద్యార్థులను ఆశీర్వదించాలన్నారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో శారీరక వ్యవస్థలపైన, భౌతికశాస్త్ర ధర్మాల పైన, అంతరిక్ష యానం పైన, ఆంధ్ర రాష్ట్ర నైసర్గిక స్వరూపాల పైన సమగ్ర అవగాహన కల్పించడం జరుగుందని ఏఓ అన్నారు.

ప్రగతి వేదికలుగా గ్రామ సచివాలయాలు

పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : గ్రామ సచివాలయాలు ప్రగతి వేదికలుగా నిలుస్తున్నాయని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దేవపట్ల, నాగిరెడ్డిపల్లె, మోటకట్ల గ్రామాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న సచివాలయం, ఆర్బీకే, జగనన్న పాల వెల్లువ డెయిరీ, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాలను ఆయన మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ప్రజల ముంగిటకే సేవలు అందిస్తూ భరోసానిచ్చాయన్నారు. సచివాలయ అధికారులు, సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న సచివాలయ వ్యవస్థ ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. నిర్దేశిత సమయం కన్నా ముందుగానే ప్రజలకు సేవలు అందుతున్నాయన్నారు. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి తనదైన ముద్ర వేశారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఆసరా లభిస్తోందన్నారు. రైతులకు కావాల్సిన సేవలను అందిస్తున్నామన్నారు. తమది రైతు పక్షపాత ప్రభుత్వమని తెలియజేశారు. విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల ద్వారా వైద్య సిబ్బందిని గ్రామాలకు తీసుకొచ్చి ప్రజలకు వైద్య సేవలను దగ్గర చేశామన్నారు. ఆరోగ్యశ్రీ పరిధి రూ.25 లక్షలకు పెంచడమే కాక చికిత్సల పరిధిని పెంచామన్నారు. దళారీ వ్యవస్థకు స్వస్తి పలికి పాడి రైతుకు చేయూత అందించడంలో భాగంగా జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అమూల్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకొని రైతులకు లీటర్‌కు రూ.20లు పాడిరైతుకు అదనపు ఆదాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు శ్రీకాంత్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రరెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్ రెడ్డి, రమేష్ రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

సీఎం జగన్ పాలనలో గ్రామీణ రహదారులకు మహర్దశ కలిగిందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. బుధవారం సంబేపల్లె మండలంలో రూ.187 లక్షల నిధులతో దేవపట్ల – చిన్నబిడికి మార్గంలో బీటీ రోడ్డు పునఃనిర్మాణ శిలాఫలకం ఆవిష్కరణ, రూ. 60 లక్షలతో నిర్మించిన దేవపట్ల సీకే రోడ్డు నుంచి రెడ్డివారిపల్లెకు నిర్మించిన బీటీ రోడ్డు ప్రారంభంలో ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలో గ్రామాలను కలిపే లింక్ రోడ్ల నిర్మాణాలను చాలా వరకు పూర్తి చేస్తున్నామని ఎమ్మెల్యే గడికోట తెలియజేశారు.

నియమాలను పాటించండి

గాలివీడు : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని మండల ఎస్ఐ వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం సిబ్బందితో కలిసి నాలుగు రోడ్ల కూడలిలో వాహనదారులకు సూచనలు, సలహాలు అందించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్‌ను తప్పనిసరిగా వాడాలని, రోడ్డు భద్రత నియామాలను పాటిస్తూ క్షేమంగా గమ్యాలను చేరాలని సూచించారు. మైనర్లకు ద్విచక్రవాహనాలను ఇవ్వకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపడం నేరమన్నారు.

దశాబ్దాల కల సాకారమవుతున్న వేళ

నేడు చిట్వేలి – కోడూరు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



స్థానికులతో మాట్లాడుతున్న విప్ కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు – చిట్వేలి రోడ్డు విస్తరణ జరగక గత దశాబ్ద కాలంగా వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. నిత్యం వేలాది వాహనాలు ఈ రహదారి గూండా ప్రయాణం సాగిస్తుంటాయి. ఎక్కువగా ఈ ప్రాంతాలలో పండించిన పంటలు బయట ప్రాంతాలకు ఎగుమతి చేయాలన్నా, కోడూరు నుంచి చిట్వేలి మీదుగా రాపూరు, వెంకటగిరి, నెల్లూరు, అలాగే పెనగలూరు, రాజంపేటకు నిత్యం వేలాది వాహనాలు, వందలాది మంది ప్రజలు ప్రయాణిస్తుంటారు. ఈ మార్గాన గతంలో చాలా ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడిన సంఘటనలు చాలానే ఉన్నాయి. అయితే ఎట్టకేలకు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఎంపీ మిథున్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. తక్షణం స్పందించిన ముఖ్యమంత్రి కోడూరు – చిట్వేలి మధ్య రూ.50 కోట్లతో డబుల్ రోడ్డును మంజూరు చేశారు. గురువారం (నేడు) రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించనున్నారు. బుధవారం సాయంత్రం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తిమ్మిశెట్టిపల్లె వడ్డిపల్లె తదితర రోడ్డు ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో చిట్వేలి మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులరెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ జయప్రకాశ్, సర్పంచ్‌లు శ్రీరామ్ వినోద్, హరిక్రిష్ణారెడ్డిలు, బండారు మల్లికార్జున, రాజేంద్ర, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓను కలిసిన ప్రభుత్వవిప్

రైల్వేకోడూరు : రాజంపేట ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన మోహన్‌రావును బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. అనంతరం నియోజకవర్గంలో జరుగుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అలాగే రెవెన్యూ పరంగా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషిచేయాలని ఆర్డీఓకు సూచించారు.

ప్రజారోగ్యమే సీఎం జగనన్న లక్ష్యం



ఆరోగ్యశ్రీ కార్డును అందజేస్తున్న దృశ్యం

రాజంపేట : మెరుగైన ప్రజారోగ్యమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాజంపేట మున్సిపాలిటీ జేసీఎస్ కన్వీనరు పద్దె రమణ, మున్సిపాలిటి కో–ఆప్షన్ సభ్యుడు రాముయాదవ్ అన్నారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం దేశంలో ఎక్కడాలేని విధంగా అమలు చేస్తున్నారన్నారు. ప్రతి గడపకు సర్కారీ వైద్యం వెళ్లాలనే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. పేద రోగులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. కమిషనరు రాంబాబు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మున్సిపాలిటీలో అన్ని వార్డులలోని పేదలకు ఆరోగ్యశ్రీ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేనేజరు శేషఫణి, ఏఎస్ఎం విజయ కుమారి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ డే

శాస్త్ర సాంకేతిక రంగంలో విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలతో ముందుకు రావాలని విద్యాధికారులు, ఉపాధ్యాయులు తెలియజేశారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని అన్ని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త సీవీ రామన్ అని తెలియజేశారు. కాంతి మీద ఆయన చేసిన పరిశోధనలు, ఆవిష్కరణలకు గాను 1930వ సంవత్సరం ఫిబ్రవరి 28న నోబెల్ బహుమతి అందుకున్నారని అందుకు గుర్తుగా ఈ రోజున జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకొని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



సిద్దవటం: విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న రేంజర్ కళావతి, ఎస్ఐ ఓబన్న



రాయచోటి టౌన్: మెమెంటోలు అందిస్తున్న దృశ్యం



పుల్లంపేట: విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ



రాయచోటి అర్బన్: ప్రదర్శనలో విద్యార్థుల పాజెక్టులు



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్



నందలూరులో ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎంఈఓలు



ఓబులవారిపల్లెలో..



లక్కిరెడ్డిపల్లె: సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



గాలివీడు: విద్యార్థులకు బహుమతులను అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు